తల్లులను క్షోభకు గురి చేయడం తగదు



నాకు ఒక పాప, ఒక బాబు. ఇద్దరూ చదువుతున్నారు. గత జగన్ ప్రభుత్వంలో అమ్మఒడి క్రమం తప్పకుండా వచ్చేది. పిల్లల అవసరాలు తీర్చడానికి మాకు ఆ డబ్బులు ఎంతగానో ఉపయోగపడేవి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఇద్దరికీ రూ.15 వేలు చొప్పున రూ.30 వేలు వస్తాయని ఆశ పడ్డాం. కాని ఇప్పటివరకూ అందించ లేదు. తల్లికి వందనం అని చెప్పి తల్లులను క్షోభకు గురిచేయడం పవన్, చంద్రబాబుకు తగదు.

- గండికోట అరుణ, తల్లి, జగ్గంపేట నియోజకవర్గం

రైతులకు ఎప్పుడు సాయం చేస్తారు



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. గత జగన్ ప్రభుత్వంలో పంట పెట్టుబడుల సమయానికి రైతు భరోసా అందేది. నాకు గత ప్రభుత్వంలో సాలుకి రూ.15,500 రైతు భరోసా వచ్చేది. ఈ ప్రభుత్వంలో రూ.20 వేలు అందిస్తామన్నారు. కానీ ఇప్పటి వరకూ రైతుకు రూపాయి సాయం అందలేదు. పెట్టుబడికి అధిక వడ్డీకి అప్పులు చేశాం. ప్రభుత్వం ఎప్పుడు సాయం అందిస్తుందో తెలియక సతమతం అవుతున్నాం. అన్నదాత సుఖీభవ పథకాన్ని వెంటనే అందించి రైతులను ఆదుకోవాలి.

- దంద్రు అప్పారావు, రైతు, జగ్గంపేట నియోజకవర్గం

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారో..



కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తామని చంద్రబాబు, పవన్ ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటివరకూ కనీసం ప్రణాళిక చేపట్టలేదు. గతంలో కూడా నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి అరకొరగా సాయమందించి యువతను మోసం చేశారు. ఇప్పుడు కనీసం ఆ ఊసే ఎత్తడం లేదు. యువతకు నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారో చెప్పాలి.

- రావుల కామేశ్వరరావు, నిరుద్యోగ యువకుడు, జగ్గంపేట

ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడు ?



తాము అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని, ముఖ్యంగా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పిస్తామని చంద్రబాబు చెప్పారు. అధికారం చేపట్టి రెండు నెలలు సమీపిస్తున్నా పథకం అమలు చెయ్యలేదు. పక్క రాష్ట్రాలైన కర్నాటక, తెలంగాణాల్లో ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేశారు. మన రాష్ట్రంలో ఎప్పుడు అమలు చేస్తారు.

- ఒబిణ్ణి కృష్ణ, గండేపల్లి

గ్యాస్ సిలిండర్ల కోసం ఎదురు చూస్తున్నాం



సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ప్రతి కుటుంబానికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత గ్యాస్ సిలిండర్ల ఊసే ఎత్తడం లేదు. మాకు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఎప్పుడు ఇస్తారా ? అని ఎదురు చూస్తున్నాం.

- పప్పల కనకలక్ష్మి, కిర్లంపూడి

నాడు వెల్లివిరిసిన సంక్షేమం



వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో కుల మతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయి. గ్రామ వలంటీర్లు నేరుగా లబ్ధిదారుల తలుపు తట్టి పథకాలను అందజేశారు. జగనన్న ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ క్యాలెండర్‌ను ప్రకటించి పక్కాగా అమలు చేశారు. అన్నదాతలకు రైతు భరోసా, అక్కచెల్లెమ్మలకు చేయూత, విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన రూపంలో అన్ని వర్గాలకూ పథకాలు అందాయి. ఇంటింటా సంక్షేమం వెల్లివిరిసింది.

జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందిన సాయం

పథకం: రైతు భరోసా

నియోజకవర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
తుని	89.41
ప్రత్తిపాడు	60.67
జగ్గంపేట	57.66


జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందించిన సాయం

పథకం: అమ్మ ఒడి

నియోజకవర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
తుని	37.35
ప్రత్తిపాడు	32.47
జగ్గంపేట	43.24

సూపర్ సిక్స్..మోసం ఫిక్స్


- ఎన్నికల హామీల ఊసేత్తని కూటమి ప్రభుత్వం
- సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని ప్రజల డిమాండ్



గోకవరం: తాము అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పేరుతో పథకాలు అమలు చేస్తామని రాష్ట్రమంతా ఊకదంపుడు ప్రసంగాలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారం చేపట్టి 50 రోజులు అయినా ఆ ఊసెత్తడం లేదు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయగలమా ? అన్న సందేహం కలుగుతుందని అసెంబ్లీలో సాక్షాత్తు సీఎం చంద్రబాబు ప్రసంగించడంపై ప్రజలు విస్మయం చెందుతున్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి రైతుకి ఏటా రూ.20 వేల ఆర్థిక సహాయం అన్నదాత సుఖీభవ పథకం కింద అందజేస్తామని, కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ రూ.15 వేలు చొప్పున తల్లికి వందనం పేరిట ఇస్తామని, ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు అందజేస్తామని, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని, ప్రతి మహిళకు నెలకు రూ.1500 బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని, వీటితో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే హామీలను గాలికొదిలేశారు. ఎన్నికల ముందు బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ అంటూ ఎన్నికల ప్రచారం నిర్వహించిన చంద్రబాబు అధికారం చేపట్టిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ చందాన మారిందని ప్రజలు వాపోతున్నారు.


ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ ఇంకా రైతులకు ఎటువంటి ఆర్థిక సహాయం అందించలేదు. పాఠశాలలు తెరిచినా తల్లికి వందనం జమ కాలేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చెప్పిన తేదీకి పక్కాగా పథకాలను అందజేశారు. ఎన్నికల మేనిఫెస్టోను 99 శాతం అమలు చేశారు. దీంతో గత ప్రభుత్వం మాదిరిగా మేనిఫెస్టోలో చెప్పిన పథకాలన్నీ అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కూటమి పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందాల్సిన సాయం



నియోజకవర్గం	లబ్ధిదారులు
తుని	24,843
ప్రత్తిపాడు	22,840
జగ్గంపేట	28,831

యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి



నియోజకవర్గాల వారీగా లబ్ధిదారుల అంచనా

తుని:	26,232
ప్రత్తిపాడు:	28,926
జగ్గంపేట:	24,537
ఇవ్వాల్సిన మొత్తం:	రూ.23.90 కోట్లు

మహిళలకు ప్రతి నెలా 1500



నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు

తుని:	74,250
ప్రత్తిపాడు:	83,526
జగ్గంపేట:	78,765
నెలకు ఇవ్వాల్సిన సాయం:	రూ.35.48 కోట్లు

టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లులకు అందాల్సిన సాయం



నియోజకవర్గం	లబ్ధిదారులు
తుని	25,505
ప్రత్తిపాడు	21,652
జగ్గంపేట	22,429

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం



నియోజకవర్గాల వారీగా లబ్ధిదారుల అంచనా

తుని:	1,13,814
ప్రత్తిపాడు:	1,10,057
జగ్గంపేట:	1,16,278

ప్రతి కుటుంబానికి మూడు గ్యాస్ సిలిండర్లు



నియోజకవర్గాల వారీగా లబ్ధిదారుల అంచనా

తుని:	74,253
ప్రత్తిపాడు:	80,506
జగ్గంపేట:	88,524

పెట్టుబడికి ఇబ్బంది పడుతున్నాం



గత ప్రభుత్వంలో ఖరీఫ్‌లో పెట్టుబడికి ఇబ్బంది ఉండేది కాదు. ఖరీఫ్ ప్రారంభంలోనే ప్రభుత్వం రైతు భరోసా నిధులను అన్నదాతల ఖాతాల్లో జమ చేసేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 50 రోజులు గడుస్తున్నా రైతులకు ఇచ్చే పెట్టుబడి సాయం ఊసే ఎత్తడం లేదు. ప్రస్తుత ఖరీఫ్‌లో పెట్టుబడికి డబ్బులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంటో ఉన్న వస్తువులు తాకట్లు పెట్టి అప్పులు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. జగన్ ప్రభుత్వానికి ముందు పరిస్థితులే మళ్లీ వస్తున్నట్లు కనిపిస్తోంది.

- సుర్ల నాగేశ్వరరావు, రైతు, టీజే నగరం, కోటనందూరు మండలం

అమ్మ ఒడి డబ్బు సక్రమంగా అందేది



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమ్మఒడి పథకం ద్వారా ఏడాదికి రూ.15 వేలు సక్రమంగా అందేవి. సార్వత్రిక ఎన్నికలకు ముందు చంద్రబాబు, టీడీపీ నేతలు అమ్మఒడికి బదులు తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంత మంది పిల్లలున్నా ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. మేము చంద్రబాబు మాటలు నమ్మి కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేశాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తల్లికి వందనం గురించి మాట్లాడక పోవడం బాధాకరం.

- గదుల లక్ష్మి, జి.కొత్తపల్లి, శంఖవరం మండలం

రైతు భరోసాతో ఎంతో మేలు



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా రైతులకు ఎంతో మేలు చేసింది. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఏటా క్రమం తప్పకుండా సాగుకు పెట్టుబడి సాయం అందించేవారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సబ్సిడీలపై విత్తనాలు, రసాయనక ఎరువులు అందించేవారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదు.

- యెద్ల సత్యనారాయణ, రైతు, జి.కొత్తపల్లి, శంఖవరం మండలం

గతంలో విద్యా సంవత్సరం ప్రారంభంలోనే..



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏటా విద్యా సంవత్సరం ప్రారంభంలోనే అమ్మఒడి పథకం ద్వారా ఆర్థిక సాయం అందేది. కూటమి ప్రభుత్వం అధికారంలో వస్తే తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని టీడీపీ నాయకులు ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చాక నోరుమెదపడం లేదు. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా ఆర్థిక సాయం అందకపోవడంతో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, స్టేషనరీ కొనుగోలు, ఫీజులుకు ఇబ్బంది పడుతున్నాం.

- లక్ష్మి, ఎస్.పైడిపాల, విద్యార్థి తల్లి, రౌతులపూడి మండలం

క్లుప్తంగా

వనదుర్గ అమ్మవారికి ఘనంగా ప్రత్యంగిర హోమం

అన్నవరం: రత్నగిరి దుర్గామాతగా పూజలందుకుంటున్న వనదుర్గ అమ్మవారికి భాద్రపద పౌర్ణిమ పర్వదినం సందర్భంగా బుధవారం ఘనంగా ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ప్రత్యంగిర హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి ఘనంగా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. అమ్మవారికి ప్రసాదాలు నివేదించి భక్తులకు పంపిణీ చేశారు. ప్రత్యంగిర హోమం, పూజ కార్యక్రమాలను వేద పండితులు యనమండ్ర శర్మ, గంగాధరబట్ల గంగబాబు, ఆలయ అర్చకులు కోట వంశీ, పరిచారకులు ఫణిశర్మ, వ్రతపురోహితులు కూచుమంచి ప్రసాద్ తదితరులు నిర్వహించారు. 15 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

విధిగా ఈ కేవైసీ నమోదు చేయించుకోవాలి



ఈ కేవైసీ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏఓ

కోటనందూరు: పంట వేసిన ప్రతి రైతు విధిగా ఈ కేవైసీ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని ఇండుగపల్లి, బిళ్లనందూరు, ఎస్సార్‌పేట గ్రామాల్లో జరిగే ఈ కేవైసీ నమోదు ప్రక్రియను బుధవారం ఏఈఓ కేవీ శివకుమారితో కలిసి ఆయన పరిశీలించారు. ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ నెల 20తో ఈ కేవైసీ నమోదుకు గడువు ముగుస్తుందన్నారు. ఈ కేవైసీ నమోదు చేయించుకోకపోతే పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, ధాన్యం కొనుగోలు, పంట రుణాలు వంటి ప్రభుత్వ పథకాలు వర్తించవన్నారు. మండలంలో వరి, ఉద్యాన పంటలు 15,200 ఎకరాల్లో సాగు చేయగా 9,800 ఎకరాలకు సంబంధించి మాత్రమే రైతులు ఈ కేవైసీ నమోదు చేయించుకున్నారన్నారు. రైతు సేవా కేంద్రాలకు వెళ్లి పంటనమోదుతో పాటు ఈ కేవైసీ నమోదు చేయించుకోవాలని సూచించారు. వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల సామాజిక తనిఖీలపై గ్రామసభలు



రంపయర్రంపాలెంలో ఉపాధి గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

గోకవరం: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఉపాధి హామీ పథకంలో నిర్వహించిన పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీలపై గ్రామ సభలు జరిగాయి. గతేడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఏడాది మార్చి 31 మధ్యకాలంలో చేపట్టిన అన్ని రకాల పనులపై ఎస్ఆర్పీలు, డీఆర్పీలు ఈనెల 14 వరకు సామాజిక తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా కృష్ణునిపాలెం, తంటికొండ, రంపయర్రంపాలెం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన సీసీరోడ్లు, సీసీ డ్రైన్లు, మినీ గోకులం, పంచాయతీ భవనాలు వంటి పనుల్లో మస్తర్లు కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉన్నట్టు గుర్తించామని ఎస్ఆర్పీ తులసీనాయక్ తెలిపారు. ఈనెల 24 వరకు ఈ గ్రామసభలు జరుగుతాయని ఏపీఓ శేషఅప్పలరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంబుడ్స్‌మెన్ పర్సన్ ఎస్.ఖాదర్‌భాషా, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ఇతర ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు..

వేలంలో రూ.1,08,703 లడ్డూ



ఏలేశ్వరంలో లడ్డూలు దక్కించుకున్న భక్తురాలు పైల శైలజ

ఏలేశ్వరం: గణపతి నవరాత్రుల్లో భాగంగా పట్టణంలో నిర్వహించిన వేలంపాటలో పైల శైలజ రూ.1,08,703 లకు లడ్డూ దక్కించుకుంది. స్థానిక సాయినగర్‌లో ఆలయకమిటీ ఆధ్వర్యంలో 18 లడ్డూలకు వేలంపాట నిర్వహించగా శైలజ పాడింది. కార్యక్రమంలో ఆకాశపు బుల్లియ్య, దుర్గాభవానీ, చల్లారాము, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

గండేపల్లి: విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని గ్రామ ఉప సర్పంచ్ జాస్తి వసంత్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మండల స్థాయి బాలుర ఎంపిక పోటీలు మురారి హైస్కూల్‌లో బుధవారం నిర్వహించారు. మల్లేపల్లి, గండేపల్లి, మురారి, తాళ్లూరు, నాయకంపల్లి, సూరంపాలెం హైస్కూల్స్ నుంచి విద్యార్థులు పాల్గొనగా అండర్-14, 17 వాలీబాల్, ఖోఖో, చెస్, కబడ్డీ పోటీల్లో విద్యార్థులను ఎంపిక చేశారు. మొత్తం 18 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వీరిని పీడీ ప్రసన్నకుమారి అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఎంసీ మెంబర్ ఎస్.శ్రీనివాస్, హెచ్ఎం ఎస్.అమ్మాజీ, సర్పంచ్ కుక్కల ఆనంద్‌బాబు, మండల ఎస్‌జీఎఫ్ఐ కో ఆర్డీనేటర్ ఎస్ నవీన్ కుమార్, పీడీలు, పీఈటీలు జి.హరికృష్ణ, వరప్రసాద్, గురుమూర్తి, ప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ పొర కాపాడుకోవల్సిన బాధ్యత అందరిది

ఏలేశ్వరం: ఓజోన్ పొర కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.సునీత అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో బుధవారం ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీకళాశాల రసాయన విభాగధిపతి వి మల్లిఖార్జునశర్మ, వైస్ ప్రిన్సిపాల్ చెన్నారావు, ఎన్ఎస్ఎస్ పీఓ ప్రగడ ప్రయాగమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్గంపేట: భవిష్యత్ తరాల ఆరోగ్యం కాపాడడం మన బాధ్యత అని, దీని కోసం ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వద్ద తల్లి పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. కళాశాల ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఓ పి.నారాయణమూర్తి, జిల్లా పంచాయితీ అధికారి సౌజన్య భారతి, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, జగ్గంపేట జెడ్పీటీసీ ఒమ్మి బిందుమాధవి విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం

తుని: పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు కోరారు. బుధవారం స్వచ్ఛత హీ సేవ ర్యాలీ పురపాలక సంఘం కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా గొల్ల అప్పారావు సెంటర్ వరకు ర్యాలీగా వచ్చి మానవహారం నిర్వహించారు. పురపాలక సంఘం ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించారు. మాజీ మున్సిపల్ చైర్మన్లు కుసుమంచి శోభారాణి, యినుగంటి సత్యనారాయణ, డీఈఈ ప్రకాశరావు, శానటరీ ఇన్‌స్పెక్టర్ శేఖర్, మెప్మా సిబ్బంది, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

తుని నుంచి హైదరాబాద్‌కు బస్సు సర్వీసు

తుని: ఏపీఎస్ఆర్టీసీ ప్రయాణికుల కోసం తుని నుంచి హైదరాబాద్‌కు స్లీపర్ బెర్తలతో కూడిన బస్సును నడుపుతున్నామని తుని డిపో మేనేజరు కిరణ్‌కుమార్ బుధవారం తెలిపారు. డిపో నుంచి ప్రతి రోజూ సాయంత్రం 6.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు హైదరాబాద్ బీహెచ్ఈఎల్‌కు చేరుకుంటుందన్నారు. తుని నుంచి నాన్ ఏసీ స్లీపర్ సర్వీసు ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఆన్‌లైన్‌లో టికెట్లు బుకింగ్ చేసుకోవడానికి 7382921904, 7382913216, 7382925514 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

జగ్గంపేట: కాట్రావులపల్లి గ్రామానికి చెందిన మహిళ కాలిన గాయాలతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. జగ్గంపేట ఏఎస్ఐ నూకరాజు తెలిపిన వివరాల ప్రకారం .. కాట్రావులపల్లికి చెందిన గంధం అమ్మాజీ(74) ఈనెల 14వ తేదీన ఇంటిలో టీ పెట్టేందుకు గ్యాస్ స్టౌవ్ వెలిగించగా రెగ్యులేటర్ వద్ద మంటలు వ్యాపించాయి. దీంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మంగళవారం అర్ధరాత్రి మృతి చెందింది. ఆమె కుమారుడు నాగేశ్వరరావు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ నూకరాజు తెలిపారు.

రక్తదాన శిబిరం

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థులచే కాకినాడ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 180 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏ రమేష్, డీన్స్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ ఎం.రఘునాథ్, చిట్టూరి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

తొండంగి: మండలంలోని 220 కేవీ టవర్స్ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా నాలుగు రోజుల పాటు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని జగ్గంపేట విద్యుత్‌శాఖ ఈఈ రత్నాలరావు ప్రకటనలో బుధవారం తెలిపారు. కృష్ణాపురం అగ్రికల్చర్ ఫీడర్, ఎ.కొత్తపల్లి, రావికంపాడు ఫీడర్ల పరిధిలోని పి.ఇ.చిన్నాయపాలెం, శృంగవృక్షం, పి.అగ్రహారం, ఎ.కొత్తపల్లి గ్రామాలకు ఈనెల 20 నుంచి 23 వరకూ ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. రైతులు, గృహ వినియోగదారులు, చిన్న తరహా పరిశ్రమల వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

కబడ్డీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీప్రకాష్ అధినేత నరసింహారావు

తుని: సీబీఎస్ఈ బోర్డు ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 17 వరకూ గద్వాల్ ఎస్ఆర్ విద్యానికేతన్‌లో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో స్థానిక శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్-14 , అండర్-19 బాలుర విభాగంలో పి.శివాజీ బృందం, ఎం.గణేష్ శివసాయిరామ్ టీం ప్రథమస్థానం సాధించి బంగారు పతకాలు సాధించారు. వీరు అక్టోబర్ 16వ తేదీ నుంచి 20 వరకూ ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు విద్యాసంస్థల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ జరిగిన క్లస్టర్-7 పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు 30 మంది బంగారు పతకాలతోపాటు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బుధవారం విద్యాసంస్థల అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



రౌతులపూడి మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయులను సత్కరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

రౌతులపూడి: ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారాలు అందుకున్న మండల ఉపాధ్యాయులకు ఎంపీడీఓ ఎం.ప్రేమ్‌సాగర్ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు పురస్కారం అందుకున్న ఉపాధ్యాయులు కోళ్ల రాంబాబు, సింహాచలం, రాజులను మండల జెడ్పీటీసీ గొల్లు చినదివానం, ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, రౌతులపూడి ఉపసర్పంచ్ వాసిరెడ్డి భాస్కరబాబు, ఎంఈఓ-2 గాడి కొండబాబు తదితరులు ఘనంగా సత్కరించారు.

మొక్కుబడిగా 'స్వచ్ఛత హి సేవ'

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో నిర్వహిస్తున్న స్వచ్ఛత హి సేవ కార్యక్రమం మొక్కుబడి జరుగుతోంది. కార్యక్రమం చేపట్టిన తొలిరోజు 50 మంది సిబ్బంది వరకు పాల్గొన్నారు. బుధవారం మాత్రం 40 మంది కూడా లేరు. దేవస్థానంలో రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సుమారు 1,500 మంది వరకు పని చేస్తున్నారు. వారిలో కనీసం పది శాతం మంది కూడా కార్యక్రమంలో పాల్గొనకపోవడంతో నిర్లక్ష్యానికి నిదర్శనం. కార్యక్రమంలో ఫార్మసీ సూపర్‌వైజర్ వి.మాధవి తప్ప మహిళా ఉద్యోగులు ఎవరు పాల్గొనలేదు.

భారీ వాహనాలు నిలిపివేయాలి

శంఖవరం: రౌతులపూడి నుంచి కత్తిపూడి మీదుగా కాకినాడ అధిక లోడుతో వెళుతున్న లారీలను నిలిపివేయాలంటూ స్థానికులు ధర్నా చేశారు. కత్తిపూడి శివారు నెల్లిపూడి రోడ్డులో బుధవారం స్థానికులు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేశారు. దుమ్ము, దూళితో అనారోగ్యంపాలవుతున్నామని, అధిక లోడుతో వస్తున్న వాహనాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.

ఏచూరి సేవలు చిరస్మరణీయం

ఏలేశ్వరం: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సేవలు చిరస్మరణీయమని ఆ పార్టీ మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు అన్నారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. అనంతరం ఏచూరి సేవలను కొనియాడారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పిల్లా రాంబాబు, బూడి జగదీష్, రౌతు సత్యనారాయణ, రాజులమ్మ, పద్మలత, మంగ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్లు నిర్మించాలి

కిర్లంపూడి: జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ డిపార్ట్‌మెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యనారాయణ లబ్ధిదారులకు సూచించారు. బుధవారం వేలంకలో జగనన్న కాలనీని ఆయన సందర్శించారు. జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు డిసెంబర్‌ఖల్లా పూర్తి చేయాలన్నారు. ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు, ఏఈ గుప్త, సర్పంచ్ రాయుడు స్వామి, కార్యదర్శి యర్రంశెట్టి వీర్రాజు తదితరులు ఉన్నారు.